అధికారదర్పం విషసర్పం లాంటిది. కాటు తిన్న మనిషిక కసి వున్నా పామునేమీ చెయ్యలేక పోవడమే....యిందులో వున్న బాధ.

మనోహరరావు చేతి గడియారంకేసి చూస్తే అది నవ్వి నాలుగుం ముప్పావని చెప్పింది.
ఇంకో అరగంటలో వస్తుంది మద్రాసు ఫ్లయిటు. దానిలో మొగుడొస్తాడు.

[అబ్బే! మనోహరరావు మగవాడే! మగవాళ్ళకూ మొగుళ్ళుంటారు: వాళ్ళని 'బాస్' అంటారు. ఈ బాస్‌లలో మామూలు రకంవీ, రంకువీ, అని రెండు రకాలుంటాయి.]

# PRAISE LORD!
## అనుసర్పదష్టుడి కథ

**వాకాటి పాండురంగారావు**

మద్రాసు ఫ్లయిటులో వస్తున్నది రంకు బాసవడంవల్లనే మనోహరం మనస్సేమీ అంత మనోహరంగా లేదు. ఆ వస్తున్న టి. జె. ఆశీర్వాదం తమ హెడ్ క్వార్టర్సులో సి. ఓ. ఎం ఏ అనగా కంట్రోలర్ ఆఫ్ మానిటరీ అఫైర్స్!

తమ కంపెనీ, సరుకులను మోసుకొచ్చిన వేగన్ ఒకటి గమ్యం చేరలేదు: అది కనుక్కుందామని. "సదా మన సేవలో" వుండే రైల్వేవారిని వెతుక్కుంటూ భాగ్యనగరం వచ్చాడు మనోహర్: నాలుగు రోజులు చెమటోడ్చిం తర్వాత ఆ కనపడకుండా వున్న రైలు వేగను తమదేనని ఒప్పుకున్నారు రైలు వారు అది పదివేలు కదా! అమ్మయ్య అనుకుని తర్వాత మెట్లు ఎక్కబోయిన మనోహర్ సంతోష సామ్రాజ్యంలోకి కురుపార్వభౌముడిలా విచ్చేయబోతున్నాడు. ఆశీర్వాదం అవబడే సి.ఓ.ఎమ్. ఏ. అను కోమా....

హెడ్‌క్వార్టర్సులో వుండగా అయితే రోజూ ఆ ఆముదం మొహాన్ని చూడడం. ఆ మోహానికి అటూ ఇటూ ఎర్రగా కాల్చిన గరిటతో వాతలు పెడదామని మనసులో వున్నా పరమ శివుడిలా ఆ హెవీ ఫీలింగంతా మింగేసి· చాల ఫ్రెష్ చిరునవ్వొకటి మొహానికి పులుముకుని— "మాణింగ్సార్!" అనిచేయెత్తి షై కొట్టాలి. షై కొట్టడం గురించి అనుకుంటుంటే గుర్తొచ్చింది.

ఓసారి వరండాలో వస్తున్న కోమా— అదే ఆశీర్వాదం గారికి ఓ హెడ్ గుమాస్తా సెల్యూట్ చేసి! పక్కగా ఒదిగిపోయాడు.

అతడిని "లేసర్" కిరణాల్లాంటి చూపులతో 1/60 సెకండు కాలం కాల్చి.... "వాట్ మేన్ .... ఇంకో చేయి ఏమయిపోయింది!" అని వెళ్ళిపోయారు కోమాశీర్వాదం. అప్పు డర్థమయింది. ఆ హెడ్ గుమాస్తాకు-తాను పాశ్చాత్య సంప్రదాయానుసారం కుడిచేతిని నెత్తికి కొట్టుకుని విష్ చేసినట్టున్నూ. బాస్‌గారేమో భారత సంప్రదాయం ప్రకారం రెండు చేతుల నమస్కారంకు ఎదురు చూసినట్లున్నూ. వెధవది ఈ శతకోటి దండాన్వయాలలో ఎప్పటికెయ్యది ప్రస్తుత మో .ఒక్క సర్వీసు మేన్యువలూ చెప్పేడవదుకదా అనిగింజుకుపోయాడు హెడ్‌గుమాస్తా! టిపికల్ భారతనారీ తిలకంలాటి మనసుగల అలాటివారికి బాస్ యేదిచేసినా రైటే! బూతులుతిట్టి పైలు మొహాన విసిరేసే వాడయితే...." అబ్బ....బాపి వాళ మాంచి ఫైరింగ్ మూడ్‌లో వున్నాడండీ-అని అల్గాపిక్మక్‌గా మురిసిపోతారీ పతివ్రతలు.

అనుకున్న మనోహరాన్ని తా పివాళ ఈ రంబాస్‌ని యెలా విష్ చేయాలి అన్న సమస్య పట్టుకుంది.

అయినా తాను సేల్సు డివిజన్‌లో డిప్యూటీ మేనేజరు: తన మేనేజర్ ముకుందం ముదలియార్ పాపం మంచివాడు' భాగ్యంకొద్దీ బాస్ అన్నట్టు



కాకర పూవుల రమణి - లేనవ్వుల పూగుత్తి భలే రోజా మజా!

తనకాయన దొరికాడు. అయితే మరి హెడ్ క్వార్టర్స్‌వారి ఆశీర్వాదం పీనుగు రాక గురించి తనకు టెలెక్స్ ఇవ్వడం ఏమిటి?

"రిసీవ్ కోమా ఈవెనింగ్ ఫ్లైట్—" అన్న ఆ టెలెక్స్ రాకతో ఆరంభమయింది ఈ అశోకవనంలో సీత కథ.

హెడ్‌క్వార్టర్స్‌లో నయితే ఏదో విధంగా ఈ రంకాని చూడటం, రంకా లెక్కతం వాడు జ్ఞానసుజీవూస అనుకుని పడేసే పెంటికల్ని ఏరుకోవడం. వాడు ఇవే జోకులనుకుని వేసేవాటికి విరగబడి నవ్వడం వాడు చాల అమాయకంగా మొహంపెట్టి ఏదో వరం ఇస్తున్న పోజులో జారీచేసిన హుకుంలని శిరసావహించడం- తప్పదు.... కాని హాయిగా నాలుగువందల మైళ్ళ దూరాన "వాతావరణ కాలుష్యం" లేకుండా బ్రతుకుతుంటే- హిమాలయాల్లోకి వెళ్ళినా ఇన్‌కంటాక్స్ పోరు తప్పనట్లు— ఇంత పెద్దదేశం వుండగా సరిగ్గా ఈ హైదరాబాద్ కే ఇప్పుడే ఈశరంబాగాడు తగలడాలా !— అని విలవిలలాడిపోయాడు మనో.

కాని కీర్తిశేషుడు ఘంటసాల పాడినట్లు "విధి బలీయం !" కదా.

అంచేత మద్రాస్ ఫ్లయిటూ వచ్చింది

దాన్లో తిరుప్పూర్ జాన్ ఆశీర్వాదమూ వచ్చారు.

నెమ్మదిగా రన్‌వే దాటివస్తున్న కోమాని చూడగానే మనో తన మనోభావాల తంత్రులను చక్కగా శృతి పెట్టుకున్నాడు. ఆయన పదిగజాల దూరంలో వుండగా, అటు పరుగూ, ఇటు నడకా కాని వేగంతో ముందుకెళ్ళిపోయి "ఈవినింగ్ సాహ్" అని బోలెడంత సంతోషంతో గ్రీట్ చేశాడు. షేక్‌హ్యాండ్-కమ్-నమస్కారం లాంటిది పెట్టాడు. ఇంత హడావిడీ తన జన్మహక్కు అన్నట్లుగా స్వీకరించిన ఆశీర్వాదం— ఆంటోనీని చూపిన క్లియోపాత్ర వలె మోనాలిసావలె— లేలేత మందహాసంతో అతడిని ఆశీర్వదించాడు.

మరోక్షణం ఆయన చూపు క్వాలిటీలో మార్పు గమనించాడు మనోహరం. ఏమి పొరపాటు చేశానబ్బా అని మథనపడగా ఆయన ఎడంచేత్తో పట్టుకునివున్న తోలు సంచీ కనపడింది.

"ఓహో! ఈ సంచి నేను తీసుకోవాలని అనుకుంటున్నాడు కాబోలు.... మీన్ మేషో.... చూద్దాం ఏమవుతుందో".... అనుకుని ప్రకాశంగా— "సాహ్! మీ లాగేజ్ టిక్కెట్!" అని చేయి జాచాడు.

ఆ కోటు లోపలి జేబులోంచి తీసి అత


దీపావళి శుభాకాంక్షలు!



# నవంబరు సంచికలో చదవండి!

## రెండు కొత్త సీరియల్స్ ప్రారంభం!

యద్దనపూడి సులోచనారాణి 'సీతాపతి' నవల, గంటి వెంకట రమణ 'ఈ దీపం వెలిగించండి' నవలలు సీరియల్స్‌గ ఈసంచికలోనే ప్రారంభం!

పూర్తి నవల : పెద్దిభొట్ల సుబ్బరామయ్య "హృదయ రథం"

"స్వాతి"లో మాత్రమే మీరు చదవగలిగిన శీర్షికలు

మీరైతే ఏం చేస్తారు; పాత కెరటాలు, మాలతీ చందూర్; నాకు నచ్చిన కథ -బి. వి. కృష్ణరావు. పెద్దవారికి మాత్రమే -గోపీచంద్, అనంతం -శ్రీ శ్రీ, కదిలే బొమ్మల కబుర్లు -డి. ప్రభాకర్. ఈ నెల ప్రశ్న?

"స్వాతి"కే ప్రత్యేకమైన 'బాపు' కార్టూన్లు, బాపు బొమ్మల కథలు

తేజా -వసుంధర. ఊబి -జీడిగుంట రామచంద్రమూర్తి, అందం తిరగబడింది -దమయంతి.

అందుకే సచిత్ర మాస పత్రిక

స్వాతి

చదివేది! చదివించేది!! చదవాలని అనిపించేది!!!

డడిగిన దాన్నిచ్చాడు కోమా.

ఇద్దరూ కలిపి బాగేజ్ కన్వేయర్ దగ్గరకు వెళ్ళారు. నిలబడి చూస్తున్నారు.

"మిస్టర్ మనోహర్! వాట్ బ్రాట్ యూ హియర్ ....?" అని అధికారపూరిత స్వరంతో అడిగారు కోమా.

"మీ రొస్తున్నారని టెలెక్స్ వచ్చింది సార్!"

"నో నో! అసలు హైద్రాబాద్ కెందు కొచ్చారు. వై? హాలీ డేనా?"

"నో సర్! మనం స్పేర్ పార్ట్స్ పంపిన రైల్వే వేగన్ వొకటి మిస్సయింది. దాన్ని ట్రేస్ చేద్దామని వచ్చాను. నిన్న రైల్ నిలయంలో.

"ఎన్నాళ్ళయింది హెడ్ క్వార్టర్స్ వదిలి?"

"మూడురోజులయింది సార్!"

ఇంకా ఎన్నాళ్ళుంటారిక్కడ?"

"తెలియదు సార్! ఆ మూడు లక్షల సరుకులనూ-"

"అంటే నెల రోజులయినా వుండి పోతారా?"

"నో నో సర్ .... ఇథమిత్థంగా తెలుసుకుని...."

ఒక మిస్సింగ్ ఐటెమ్‌కోసం మీ వంటి సీనియర్ ఆఫీసర్ హెచ్‌క్యూ వదిలి వారం పదిరోజులుండిపోవడమా?...."

"మా మేనేజర్ గారేమో.... ఇది నువ్వే తేల్చుకు రావాలని నన్ను...."

"దిసీస్ టూ మచ్ ఐసే! ఎండిగాలిలో మాట్లాడాలి...." అన్నారు కోమా పైఅధికారుల వరుసలో, ఆయన ఎంతో మనోహరం బాస్ అయిన ముకుంద మొదలి

## 'దివ్య దీపావళి'

బంధ విముక్త విహంగములవలె
ధనిర్విముక్త అమ్ములవలె
రివ్వున మింటికెగసి
తటిల్లతల వోలె మెరసి

వివిధ వర్ణ తారకలై
నవ్యరాగ మాలికలై
ఎగసి మెరసి మురిపించే
బాణసంచా లెన్నెన్నో....!

అమావాస్య తిమిరాన్నైనా
అరుణోదయ సమయంగా
మార్చి....మనసు నలరించే
దీపాల వరుస లింకెన్నెన్నో....!

—ధనుర్ధారి

యారూ అంతే! అయినా తానందరికన్నా మిన్న అన్నట్లు నటించడం. ఇతర డిపార్ట్‌మెంట్‌లు కూడా తన మాట వినాలి అన్నట్లుగా మాట్లాడ్డం ఎం. డీ. తో మాట్లాడతానని బెదిరించడం- ఇవన్నీ కోమా టెక్నిక్కుల బుక్కులో కొన్ని ముఖ్య అధ్యాయాలు. జూనియర్ ఆఫీసర్ నయితే ఏదో ఒక అసందర్భపు ప్రశ్నవేసి. ఇరకాటంలో పెట్టేసి— ఆ తర్వాత.... "మా మూడో

వాడు ఎం. ఏ. ఫిలాసఫీలో వున్నాడు తెలుసుకదూ— వాడికేమో ఈ పుస్తకం కావాలిట" అని చాలా యధాలాపంగా ఒక చీటీ ఇస్తారు. అక్కడి నుంచి బయట పడితేచాలకునుని ఆచీటీ తీసుకెళ్ళి జాగ్రత్తగా పూరంతా వెతికి నలభై రెండు రూపాయలు పెట్టి ఆ పుస్తకంకొని పట్టుకెళ్తాడు. ఆ జూనియర ఆఫీసరులు ఈ సాయంచేసి నందుకు కోమా సంతోషపడతాడుకదా అని వెడితే అతడిని అంతకు ముందెప్పుడూ చూడనట్లుగా చూసి కోమా "ఎస్!" అంటారు.

"సార్! నిన్న పుస్తకం" అని పాకెట్ జాచబోతే.

"అయామ్ సారీ! నేనో మీటింగ్ కెళ్ళాలి. పుస్తకాన్ని ప్రభుకు పంపేయండి." అని హడావిడిగా అటుతిరిగి యింటర్ కాంలో లీనమయినట్టునటిస్తాడు.


ఆ పుస్తకం కొన్న దురదృష్టవంతుడు "ప్రభు"అంటే శ్రీవారి కుమారరత్నం అని తెలుసుకోవాలి. ఎలాగో ఒకలాగ ఆ పుస్తకం బిల్లు, సొమ్ము వంటి అల్ప విషయాలు కోమాలాటి రంబాలకు గుర్తుంటుంది అనుకుంటే ఆ ఆఫీసర్‌కు మానసికంగా ఇంకా ప్రొబేషన్ తీరలేదన్నమాట!


మనోహరాన్ని అతడు హైదరాబాద్ ఎందుకొచ్చాడని కోమా అడగడం వెనక వున్న టెక్నిక్ ఇదే! అతగాడిని డిఫెన్స్‌లో బిగించేస్తే కావలసిన చాకిరీ చేయించుకోవచ్చుకదా అని....

కన్వేయర్ మీద ఒక పెట్టెను చూపించి "అదే నాది"—అన్నారు కోమా.

బాగా గీతలుపడి. పాతబడి, ఒక తెల్ల తాడుతో కట్టిన సూట్‌కేసును చూడగానే మనోహరం గతుక్కుమన్నాడు. 'అరి నీ దరిద్రం జిమ్మడా! ఏనాటి సూట్‌కేసో ఇది! భగత్‌సింగ్ వాళ్ళు బాంబులు దాచి తీసుకెళ్ళిన దానిలా వుంది!' అనుకుని కన్వేయర్ మీదుగా వస్తున్న ఆ జవసత్వా లుడిగిన పెట్టె నందుకున్నాడు; అది తనదేనని జనం అనుకుంటారేమోనని అవమానంతో దానిని తీసుకుని కిందపెట్టి పక్కకు చూశాడు. వాడు అదే ఆయన అక్కడలేడు. దూరంగా ఫోయర్ చివర స్టైలుగా నిల్చుని వున్నారు.

రెండున్నర లక్షల ఆస్తికి జాహ్నవి అనే అందమైన యిల్లాలికి భర్త అయిన మనోహర్. నెలకు 2300 రూపాయలు సంపాదిస్తున్న సీనియర్ డిప్యూటీ మేనేజర్ అయిన మనోహర్ ఆ రావుల్ తప్పిన సూట్‌కేసుని దాని తాడు పట్టుకుని మోసు





మెరుపుతీగ సంగీత వెలిగించెను తీగ

కుని కోమా వున్నవైపుగా చూస్తూవస్తుంటే ఒక్కొక్క అడుగూ ఒక్కొక్క కిలో మీటరనిపించింది.

హఠాత్తుగా ఏదో అయినట్లనిపించింది. మరో క్షణం మనోహర్ చేతిలో తెల్లతాడు ముక్క వుంది. తాడు తెగి క్రిందపడిన సూట్‌కేసు మూత ఒక పక్క తెరుచుకోగా అందులోంచి ఒక బిస్కెట్లులేని బిస్కెట్ టిన్నూ, ఒక పంచా బయటికి తొంగి చూస్తున్నాయి! ఆలనాడు కురుసభలో నిలబడిన ద్రౌపదిలా ఫీలయిన మనోహర్‌కు అన్నీ అక్కడ వదిలేసి పరుగెత్తి, హృషీకేశం వెళ్ళిపోయి ఏదయినా ఆశ్రమం చేరిపోయి పేరు మార్చుకుందామా అన్పించింది.

కాని ఈలోగా "సూట్‌కేస్ బరువయిందా మనోహర్!" అంటూ ప్రత్యక్షమయ్యాడు కోమా.

"నాక్కాదు సార్! ఈ తాడుకు!" అన్నాడు కోపమంతా దిగమింగుతూ. గబగబా బయటికివచ్చిన వాటిని లోపలకి కుక్కి తాడు ముడేశాడు. అది ఏర్‌పోర్ట్ నీ ఈ దృశ్యాన్నీ చూస్తూ ఆనందిస్తూ ప్రయాణీకులు, కూలీలు, టాక్సీ-ఆటో వగైరాల డ్రైవర్లు వున్నారనీ, తలెత్తి చూడకుండానే తెలుసు. ఆ అవమాన భారంతో గబగబ ఆ పెట్టెనెత్తి ఒక బేగేజ్ బాయ్‌కిచ్చి, చకచక నడిచి వెళ్ళి ఒక టాక్సీలో కూలబడ్డాడు. పక్కన చూస్తే కోమా వున్నాడు.

బేగేజ్ బాయ్ మనోహర్ వున్న కిటికీ దగ్గరగా నిలబడ్డాడు. వాడికో రెండ్రూపాయలు ఇచ్చాడు మనోహర్.

టాక్సీ కదిలింది.

"నేను తీసుకొచ్చేవాడినికదా. ఒక్క సూట్‌కేసును పది గజాలు తెచ్చినందుకు రెండ్రూపాయలా? వాటే వేస్ట్!" అని మందలించిన కోమా నాలుకను ఆ టాక్సీ తలుపు సందులో పెట్టి నొక్కేస్తే బాగుండునన్పించింది. కాని ఆముదపు చిరునవ్వొకటి నవ్వి వూరుకున్నాడు మనో.

"ఎక్కడికి సార్?" అని అడిగాడు డ్రైవర్.

"బంజారా హిల్స్!" అన్నాడు మనోహర్.

"నో! నో! నేను చాదర్‌ఘాట్ దగ్గర "మిలన్ కోఠీకి వెళ్ళాలి." అక్కడో పెద్ద మనిషిని చూడాలి. అటునుంచి గెస్ట్ హవుస్ కొద్దాం" అన్నాడు కోమా.

ట్రాఫిక్ రద్దీని దాటుకుంటూ టాక్సీ పరుగెడుతుంది

బ్యాంక్‌స్ట్రీట్ దగ్గర "డ్రైవర్! ఒక్క నిముషం ఆపు" అని ఆదేశించారు కోమా.

క్రీచ్‌మంటూ ఆగింది. టాక్సీ. మనోహర్ చూస్తున్నాడు.

తలుపు తెరుచుకుని దిగి చప్పట్లు కొట్టారు కోమా.

"బ్రదర్ సంతోషం! బ్రదర్ సంతోషం!" అని ఎలుగెత్తి పిలిచారు కోమా.

యానదాస్తే అప్పుడే బజారులో పోగొట్టుకున్న నాడిలా దుఃఖంతో వున్న మొహంగల శాల్తీ ఒకటి దగ్గరగావచ్చింది.

"ప్రెయిజ్‌లార్డ్ బ్రదర్ ఆశీర్వాదం!"

"ప్రెయిజ్‌లార్డ్ బ్రదర్ సంతోషం!" అంటూ వాళ్ళిద్దరూ షేక్‌హాండ్లిచ్చుకుని ఎంతోకాలం తర్వాత కలుసుకున్న ఆప్త మిత్రుల్లా తీవ్రంగా ఇహపరాల గురించి ముచ్చటించుకోసాగారు.

టాక్సీ డ్రైవర్ మనోహర్ వైపు కొరకొర చూశాడు. క్షమాపణ చెబుతున్నట్లుగా వాడివైపు చూసి నవ్వాడు మనోహర్.

"సార్! ఈ ట్రాఫిక్ వేళ ఇక్కడ బండి ఆపరాదు సార్." అన్నాడు డ్రైవర్.

"అవునవును! నీ పేరేమిటి?" అన్నాడు మనోహర్ ఆత్మీయంగా.

"యాదగిరి సార్!"

ఉత్తమ పబ్లిక్ రిలేషన్స్ సంప్రదాయాన్ని ఒలకబోస్తూ యాదగిరితో మొరార్జీ గురించి, గోదావరి పుష్కరాల గురించి టాక్సీ డ్రైవర్ల మంచితనం గురించీ ముచ్చట్లాడసాగాడు మనోహర్.

పావుగంటయ్యాక వచ్చి లోపల కూచుంటూ కోమా.... "సారీ, మిస్టర్ మనోహర్" అన్నారు.

"అబ్బే ఫరవాలేదు...." అని గొణిగాడు మనో.

చాదర్‌ఘాట్ చేరింది టాక్సీ. అక్కడ ఇరవై నిముషాలపాటు నానా సందులూ తిరిగాక "మిలన్ కోఠీ" వున్న వీధి కనపడింది.

పెద్ద కాంపౌండ్ లోపలవుంది ఆ కోఠీ.

టాక్సీ ఆగింది.

"లోపల మిస్టర్ ఇమాన్యుయెల్ వున్నారేమో కనుక్కోగలరా?" అని మనోని ఆదేశించారు కోమా.

"ఇప్పటికి చాలా డిలే అయిపోయింది సార్!" అని గొణిగాడు యాదగిరి.

తన దగ్గరకు పి.ఎఫ్. లోన్ ఫారంతో వచ్చిన వాడిని చూసినట్లు వాడిని చూసి అటు తిరిగారు కోమా.

మనోహర్ టాక్సీ దిగి, పెద్ద గేటు దాటి, ఇటూ అటూ మొక్కలున్న దారి వెంబడి నడిచాడు. మర్రిచెట్టు కివతలగా ఒక పెద్ద బోర్డ్ కనబడింది.

"ఎప్పుడైనను నా తలుపు తట్టుడి!
మీకై తెరబవడును!" అని వుంది.

తలుపు ఎక్కడబ్బా - అని మనోహర్ వెతుకుతోండగా "భౌభౌ"మని అతి భీకరంగా విన్పించింది

ఆ బోర్డ్ కిటూ అటూ వున్న స్తంభాలలో ఒకదాని దగ్గర కనబడింది నల్లగా, ఎత్తుగా అల్సేషియన్.

సరిగ్గా రెండు సెకండ్లంటే రెండే సెకెండ్లలో టాక్సీని చేరుకున్నాడు మనోహర్, బహుశ 20 మీటర్ల డాష్‌కది

ఒక రికార్డయి వుండాలి.

"ఇమాన్యుయెల్ వున్నారా ?"

"లేరుసార్ .. అది కాద్సార్ అల్సేషియన్ వున్నాడు అదే.... అల్సేషియన్ వుంది సార్.... లోపల మరి...."

"అరె ! సీజర్‌ని చూసి వెనక్కొచ్చేశారా ! వెరీ ఫన్నీ.... అది నోట్లో చెయ్యి పెట్టినా కరవదే...." అంటూ కోమా వెళ్ళారు.

యాదగిరి మనోహర్‌ని చూసి "సార్ ! నాకు మీటర్ చూసి డబ్బు లిచ్చేయండి సార్ - నే వెళ్ళిపోతాను.." అని గుర్రుమన్నాడు ఇరకాటంలో పడ్డాడు మనోహర్. కాంపౌండు లోపలి నుంచి భౌ భౌమని మొరుగు వినిపించింది.

కోమా దానినోట్లో చెయ్యి పెట్టాలిట - అదేమో కండలూడి వచ్చేలా కొరకాలట. బొడ్డుచుట్టూ పధ్నాలుగు ఇంజక్షన్లు వేసుకోవాలప్పుడు అని ఊహిస్తూ గబుక్కున "దగ్గర్లో పెద్ద ఆసుపత్రి ఏదయినా వుందా యాదగిరీ ?" అని అడిగాడు మనో !"

యాదగిరి అదోలాచూశాడు. ఈయనకు ఒంట్లో బాగోలేదా ? లేక తన్ను డబ్బులిచ్చి పంపేయి మన్నందున విషయం మారుస్తున్నాడా?.... అనుకుంటూ "ఇక్కడే కదా సార్ ఉస్మానియా ఆస్పత్రి వుంది" అన్నాడు.

"ఔనౌను....మరే...." అన్న మనోహర్ కు డిజపాయింట్‌మెంట్ లాటిది కలిగింది. తాను ఎదురుచూసినట్లు వెంటనే నెత్తురు కారుతున్న చేతిలో కుయ్యోమంటూ రాలేదు కోమా అయిదు నిముషాల తర్వాత విజాం నవాబు స్వంత కారు దగ్గరకు వచ్చినట్లు వచ్చారు.

యాదగిరి ఈసారి కోమాతో నే అన్నాడు. "సార్ ! నాకు డబ్బు ఇచ్చేయండి !.... నాకు వేరే పని వుంది–" అన్నాడు నిరొత్సాహమాటంగా.

"అహో ! ఏమి వీడి భావ ప్రకటనా స్వాతంత్ర్యము ? ఈ పాటిది మనకు లేకపోయిందికదా.." అని కించపడ్డాడు మనో.

అందరు Bully ల్లాగే అవతలివాడు గొంతెత్తేసరికి కోమా ధోరణీ మారిపోయింది.

"ఉండమ్మా.... ఇప్పుడే పోతున్నాం కదా బంజారా-హిల్స్ దగ్గర డ్రాప్ అవగానే పోదువుగానియమ్మా-" అన్నాడు కోమా మృదువుగా. నాగుపాము ముద్దుపెటుకుంటున్నట్లుంది మనోహర్‌కు ఆ గొంతు

విసుగ్గా తలుపు ధామ్మని వేసి. బర్రమని స్టార్ట్ చేసి. టాక్సీని వేగంగా నడిపాడు యాదగిరి.


"ఇలాటి మొరటువాడి బండినెందుకు ఎన్నుకున్నారు–" అని ఇంగ్లీషులో మనోహర్‌ని తగులుకున్నాడు రంబా.

'డిటెన్షన్ కొంచెం ఎక్కువయిందనా అని అర్థాంతరంగా వదిలేశాడు మనో

"వెయిటింగ్ వాడి ధర్మం.... ఇక ముందెప్పుడూ ఇలాంటివాళ్ళని ఎంగేజ్ చేయకండి–" అని కటువుగా శెలవిచ్చాడు కోమా

ఆపాటికి ఏడున్నర దాటింది. నవంబరవడం మూలాన దట్టంగా చీకటి అలుముకొని వుంది. నియాన్ దీపాల రంగవల్లులను శోభాయమానంగా వున్న బజారులను దాటి వెళ్తుంది టాక్సీ.

హఠాత్తుగా పెద్ద వర్షం ప్రారంభం అయింది. అబిద్‌రోడ్ పక్కగా వన్-వే గుండా వస్తూంది టాక్సీ. వర్షపుధారల






# నా దివ్వె

దివ్వె వెలిగిస్తాను నేనూ
ఈ చీకటిని గెలిచి నిలుస్తాననే ధీమాతో కాదు
లెక్కలేనన్ని దివ్వెలే
చీకట్లో మునిగి మలుగుతూంటే.
నే వెలిగించే దివ్వె శాశ్వతమన్న భ్రాంతి లేదు.
దివ్వె వెలిగిస్తాను నేనూ
ఈ చీకటి నుండి వెలుగువైపు వెళ్ళగలనన్న
ఆశతో కాదు.
శతాబ్దాలుగా చీకట్లోంచే చీకట్లోకి
తడబడుతూ పడ్డాయి అడుగులు
ఎప్పుడో కాస్తంత వెలుగు కోసం
అపుడపుడు గీచాం అగ్గిపుల్లలు.
వెలిగించాం దీపం
వేదశాస్త్ర పురాణ ఇతిహాస కావ్య విజ్ఞానాల
మతాబాలు. టపాకాయలు. చిచ్చుబుడ్లు, కాకరొత్తుల
కాల్చాం.
"తమసోమా జ్యోతిర్గమయ" అంటూ
కడకు ఒత్తి బూడిదనే చూచాం
ఈ చీకటికి అంతులేని దాహం
అది నాకూ తెలుసు
ఎంత వెలుగును కట్టుకున్నా
తిన్నా. తాగినా, మరీ మరీ కావాలన్న
అంతులేని ఆసక్తి
అయినా. దివ్వె వెలిగిస్తాను నేనూ
చీకటిని అధిగమిస్తానన్న ధీమాతో కాదు
వున్నంతకాలం నేను నిన్ను
నీవు నన్ను
చూడగలమన్న ఒకేఒక ఆశతో.
దీపం ఆరిన మరుక్షణం
నీ వెవరో, నే నెవరో

కన్నడ మూలం :

**డాక్టర్ జి. యస్. శివరుద్రప్ప**

అనువాదం :

**-జానమద్ది హనుమచ్ఛాస్త్రి**

వడగళ్ళల్లా చప్పుడుతో పడుతున్నాయి. నిలువుగా గీసిన వానల గీతలను టాక్సీ దీపపు వెలుతురు రేఖలు అడ్డంగా ఖండిస్తున్నాయి.

టాక్సీ ఫతేమైదాన్‌ను సమీపించింది.

దాని దీపాల వెలుతురు మరింత కాంతివంతం అయిందనిపించింది. వీధి దీపాలు ఆరిపోయాయి ! ఊరు ఊరంతా విద్యుత్

సరఫరా ఆగిపోయినట్లుంది.

టాక్సీ ప్రకాశం బొమ్మ దగ్గరకొచ్చి ఎడమవైపు ఎత్తుగా రోడ్డెక్క నారంభించింది. ఠాక్కున ఆగిపోయింది.

యాదగిరి రెండు నిముషాలపాటు ఏవో తంటాలుపడ్డాడు. కిందకు దిగి బానెట్ తీసి కలియబెట్టాడు. తట్టాడు. మనో వైపు చూశాడు.

ఆ చూపు అర్థమయింది. మనోహర్ కూడా వానలోకి దిగాడు. యాదగిరి ఒక చేత్తో స్టీరింగ్ వీల్‌ని పట్టుకుంటూ ఇంకొక చేత్తో తోస్తుండగా కారు వెనక నుంచి తన శక్తినంతా కూడగట్టుకుని తోసే బాధ్యత మనోహర్ దయింది.

కారు హంస గమనంతో కదలసాగింది. పై నుంచి వాన తల మీదపడి, తల నూనెలో కలిసి జిడ్డుగా కళ్ళల్లోకి ధారలు కడుతూండగా, అంత వానలోనూ ఒళ్ళంతా చెమటలు పడుతుండగా, కటిక చీకటిలో కాలికింద రోడ్ జారిపోతుండగా - అన్నిటినీ ఓపికగా సర్దుకుని చిన్నప్పుడు నుంచి ఆగిపోయిన కార్లు తోయడమే హాబీగా పెరిగిన వాడికి మల్లే తోస్తున్న మనోహర్‌కు.. ఆహా! నేటినుంచి మన జాతకంలో శని మహాదశ ప్రారంభమైంది కాబోలు అనిపించింది విఘడియలతోసహా చెప్పాలంటే సాయంకాలం అయిదు ప్రాంతంలో శని తన జీవితంలోకి ప్రవేశించాడని చెప్పుకోవచ్చు.

కారు గరగరమంది. బ్రతుకు జీవుడా

## ఫీనిక్స్ లా

నశిస్తూ
నీ చేతల అగ్నికీలల్లో
మళ్ళీ మళ్ళీ
కళ్ళలోంచి
నవ్వుల్లోంచి
వికసిస్తూ పునరుద్భవిస్తాను
* ఫీనిక్స్ లా......!

—ఘంటసాల నిర్మల

ఫీనిక్స్ :
ఈజిప్షియన్ పురాణాలలో కనిపించే యీ పక్షి అయిదు వందల సంవత్సరాలకు పైగా జీవించి-స్వయంగా సృష్టించుకున్న జ్వాలల్లో దగ్ధమై, అదే చితాభస్మంనుంచి నూతన రూపంతో జన్మిస్తుంది.

అంటూ తలుపు తెరుచుకుని సీట్లోకి ఎగిరి కూచున్నాడు మనో. ఆ ఫాటికే యాదగిరి కూర్చుని వున్నాడు. అంటే తాను వీళ్ళద్దరినీ తోసుకొచ్చాడన్నమాట! పళ్ళు పటపటమని కొరుక్కున్నాడు మనో.

"దీని యింజను పాతదల్లేవుంది" అని సన్నాయినొక్కు నొక్కాడు కోమా! ఒళ్ళు మండింది మనోకు. "అయ్యో....నువ్వు తోశావే. సారీ. థాంక్స్" లాటి మాట వాడినోటంట రాదేం.... దుర్మార్గుడు...." అనిపించింది అయినా.... పైకి "ఔన్సార్ ఈ వెధవ పాత ఇంజన్లే ఇంత-ప్రాణాలు తీస్తాయి-" అన్నాడు ఇంజను అనగా మనిషి అనే అర్థంతో.

లక్డీకాపూల్ దగ్గర టాక్సీని ఆపేశాడు యాదగిరి.

ఆ కూడలివద్ద మోకాలిలోతు నీరుంది. ఆటోలు, కార్లు ఆగిపోయి వున్నాయి. పాదచారులు మాత్రం జాగ్రత్తగా బట్టలు పైకెత్తుకుని ప్రవాహాన్ని దాటుతున్నారు. అటూ, ఇటూ వాహనాలు ఆగిపోగా జనం దిగిపోయి చూస్తున్నారు. హారన్ల మోత. బండితోయడానికి అయిదు రూపాయలడిగే గోచీరాయుళ్ళ కేరింతలు, అరుపులు. అంతా అల్లకల్లోలంగా వుంది.

వీధి దీపాలు వెలిగాయి.

"ఏమయ్యా! ఆపేశావు?" అని గద్దించారు కోమా.

"సార్! నేవింక ముందుకు వెళ్ళను. నాకు డబ్బులిచ్చేయండి" అని ఖచ్చితంగా చెప్పేసి దిగిపోయాడు యాదగిరి.

ఏం చెప్పినా వినలేదు కోమా. మనోహర్ వైపు కొరకొర చూశారు. "ఇలాంటి టాక్సీ వాళ్ళను నా దగ్గరి కెప్పుడూ తీసుకు రాకండి-" అన్నారు మనోతో కటువుగా. ఇతగాడికి టాక్సీలు తీసుకురావడమే నా పని కాబోలు— రోగ్ అనుకుని మనోహర్ అటు చూసేసరికి యాదగిరి డిక్కీ తెరిచి నిలుచున్నాడు.

చచ్చినట్లు డిక్కీలోంచి రంబాగాడితాడు తెగిన సూటుకేసును, బ్రీఫ్ కేసును కిందకి దించాడు మనోహర్.


యాదగిరి మీటర్ వైపు చూపి "వలభై మూడు రూపాలయింది సార్!" అన్నాడు.

మనోహర్ ఇటూ అటూ చూస్తే కోమా లేడు; ఆ! అదుగో అతి తీక్షణంగా ఆ బోర్డు చదువుతున్నవాడు అతను నాడే! ఎంత మాయ అనుకున్న మనోహర్ పర్స్ తీసి నలభై ఇదిస్తే యాదగిరి "రెండు రూపాయలు లేవు సార్!" అని టాక్సీలో కూచుని వెనక్కు తిప్పుకుని వెళ్ళిపోయాడు. 'జగమే మాయ' కదా! ఘంటసాల మీద మనోహర్ గౌరవం పెరిగింది.

"వాట్ నౌ!" అంటూ కోమా సమీపించారు.

"జంప్ ఇన్ టు హుసేన్‌సాగర్" అనగలిగితే ఎంత బాగుండునో.... కాని అనలేని దౌర్భాగ్యం తనది. అనుకుని-

"పదం జాగ్రత్తగా ఈ నీళ్ళను దాటి



— ఫొటో : బోనేపల్లి మురళి, తెనాలి

దీపచక్రకేళి

అటు వెళ్ళాలిసార్" అన్నాడు మనోహర్.

"అలాగే చేద్దాం!" అని కోమా పాంట్‌ను మోకాళ్ళదాకా మడిచి బ్రీఫ్ కేసును పట్టుకున్నాడు.

అంటే తా. తె. సూట్ కేస్ మళ్ళీ మనోహరవైపు చూసి "ప్రాణనాధా! నన్నేలు కోవా! అంది". వైరాగ్యం వచ్చాక చింతామణివైపు చూసిన బిల్వమంగళుడివలె దానిని చూసి "అర్జునా! కర్తవ్యం చేయుటయే నీ విధి!" అన్న గీతా వాక్యం స్మరించుకుని-మడిచిన పాంట్ గలవాడై, తా. తె.సూ.కే. హస్తుడై అడవికిపోతున్న శ్రీరామచంద్రుడి వెనకాల సీతమ్మలా కోమా వెనుకగా మనోహర్ ఆ నీటిలో అడుగుమీద అడుగు వేసుకుంటూ బయలు దేరాడు.

ఎక్కడన్నా ఓపెన్ డ్రెయిన్ వుంటుందేమో అని ఒక్కక్షణం భయం; మరుక్షణం ఆ భయంలోనే ఆనందం. దైవాశీర్వాదం వల్ల పీడా విరగడయిపోవును కదా అన్పించింది కాని, మనోహర్ చెడు తలపులకు ఆ పరిశుద్ధాత్మ అంగీకరించలేదు.

తప్పతడిసి అటు చేరారు. ఆటోలు, టాక్సీలు రాము పొమ్మన్నారు. చివరకు ద్వారకా హోటలు ఆవరణ లోపల ఒక టాక్సీవాడు పదిహేను రూపాయలడిగాడు. ఐదు రూపాయల దూరానికి పదిహేను!

ఎక్కారు....

"మన నిస్సహాయ స్థితి చూసి ఈ టాక్సీల వాళ్ళు Exploit చేయడం దారుణం" - అంటూ కోమా చెబుతుంటే రుద్రాక్షమాల ధరించిన కొంగ లెక్చర్‌ను వింటున్న చేపలా ఫీలయ్యాడుమనోహర్.

గెస్ట్‌హవుస్ చేరారు.

టాక్సీ ఆగగానే చకచక దిగి లోపలికి వెళ్ళిపోయారు కోమా.

మనోహర్ సూట్‌కేసుని, బ్రీఫ్‌కేసుని గెస్ట్‌హవుస్ 'బాయ్' కప్పచెప్పాడు. "ఆశీర్వాదంగారడిగితే నాకు హఠాత్తుగా గుండెపోటు వచ్చిందని, ఆస్పత్రికి వెళ్ళానని చెప్పు" అని టాక్సీలో కూచుని. "పోనీ...." అన్నాడు,

"ఎక్కడికి?"

"ఎక్కడికో వొకక్కడికి .... ఎంతయినా అడుగు. ముందు యిక్కడనుంచి వేగంగా పోనీ" అన్నాడు. "లేకపోతే ఒక మర్డర్ జరిగిపోగలదు" అని బయటికి అనలేదు.


Praise Lord! హత్య జరగలేదు! టాక్సీ వేగం పుంజుకుంది. ★

దీపావళి శుభాకాంక్షలతో!

ప్రసాద్ కామర్స్ కాలేజి
బృందావన్ గార్డెన్స్ * గుంటూరు-522006.
* MBA/CA ఎంట్రన్స్: ప్రైవేటుగా LAW/B.Ed; ICWA/DBM;
M.com/B.com: ఇంటర్(C.E.C): డైరెక్ట్‌డిగ్రీ ఎంట్రన్స్
బ్యాంకు పరీక్షలకు ప్రత్యేకశిక్షణనొసంగు ఏకైకవిద్యాసంస్థ
పోస్టల్/ఓరల్ కోచింగ్, ప్రింటెడ్ నోట్సులకు ప్రాస్పెక్టస్ రూ.5/-
డైరెక్టర్ CH. ప్రసాద్, M.com; L.L.B; D.B.M.

దీపావళి శుభాకాంక్షలతో!

కమ్మని రుచి!
తాజా పరిమళం!!
PHONE:




రుచి..సువాసన
అందించేది మేము!
సంతృప్తి..సంతోషం
పొందేది మీరు!!
కళ్యాణి
వక్కపొడినే
ఎల్లప్పుడు
వాడండి!
కళ్యాణి నట్‌పౌడర్ వర్క్సు
P.B.NO.11 మచిలీపట్నం-521001
* స్టాకిస్టులు కావలెను